మొల్ల యపకీర్తి, యామె నామవృత్తాంతము

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ గారు

శ్రీమహిమాభిరాముఁడు వసిష్ఠమహామునిపూజితుండు సు
త్రామవధూ కళాభరణ రక్షకుఁ డాశ్రితపోషకుండు దూ
ర్వామలసన్నిభాంగుఁడు మహాగుణశాలి దయాపరుండు శ్రీ
రాముఁడు ప్రోచు భక్తతతి రంజిలునట్లుగ నెల్లకాలమున్.

—మొల్లరామాయణము

సుమధురమై, మృదులమై, మనోజ్ఞమై, కవిపండిత జనస్తుత్యమై, సకలజనసుబోధ్యమై యలరు రామాయణములు రచించి మహావిదుషీమణియు, ఆదికవయిత్రియు నగుమొల్ల యమరకీర్తిని వహించినది. స్త్రీలలోఁ జదువుకొనినవారు తక్కువ. చదువుటయొకింత నేర్చినవారున్నను వ్రాయఁగలవారు కొలఁది. వచనరచన కొంత చేయనేర్చినవారున్నను పద్యములల్ల నేర్చినవారు మొదలే పూజ్యము. విశేష నాగరికతయందున్న యిక్కాలమునఁగూడ స్త్రీలస్థితి యిట్లున్నది. అట్టిచో నాల్గుశతాబ్దములకుఁ బూర్వము స్త్రీవిద్యావ్యాప్తి కెట్టియవకాశము లేనియుగమున, పురుషులకే విద్యాగంధము లేని కుమ్మరకులమున జనియించి, యిట్టి యపూర్వరామాయణమును రచియించినమొల్ల యాంధ్రమహిళామండలమును బావనముచేయ నుదయించిన యపరభారతిగాని లాఁతి స్త్రీ కాదని తోఁచెడిని.

భారత భాగవతోపాఖ్యానములతో పాటు, దాశరథీ భాస్కరాదిశతకములతో పాటు, మొల్లరామాయణముగూడ పూర్వపు వీధిబడులయందును, నిప్పటి యున్నత పాఠశాలలయందును ముఖ్యపఠనీయగ్రంథమై యొప్పుచు మొల్లయశశ్చంద్రికలను దిగంతములకు వ్యాపింపఁజేయుచున్నది. కాని పరమ పావనులగు సీతారాముల దివ్యచారిత్రమునే భక్తిరసభరితముగను, మృదుమధురపదసంయుతముగను రచియించి తననిరుపమాన కవితాపటిమచే, పాండిత్యప్రకర్షచే నాంధ్రకవయిత్రీమణులలో నగ్రస్థానము వహించిన మొల్లజన్మాదిక వృత్తాంతములు మాత్ర మామెయశస్సునకుఁ దగినట్లుగ లేవు. ఆంధ్రజననీగాత్ర సంశోభితవిదుషీ మౌక్తికహారమున మించు మణిపతకమున నొప్పు మొల్లకవయిత్రీమణి యొక్క కీర్తిచంద్రికల నైల్యపఱచుచున్న విషయము సామాన్యమైనది కాదు. ఏది స్త్రీలనిహపరదూరలనుగాఁ జేయునో, ఏది శీలసంపదకు భంగకరమైనదో, ఏది చిరకాలమునుండి ప్రవృద్ధమగుచున్న యశోలతను ఫుటుక్కున త్రుంచి వేయునదో, ఏది మహావమానకరమైన మాటయో, అట్టికులటాపదము మొల్లజీవితమునకుఁ దుడువరానిమచ్చయై కళంకపఱచుచున్నది. అకటా! ఆఁడుదానికింతకన్న నపకీర్తి యేమికావలెను? నిప్పులంబొరలినను, నీళ్లంబడినను, శిరశ్ఛేదము గావించుకొనినను, మఱి దేనిచేనైనను నీయపయశము మాయునే? ఏకవిత్వము, ఏపాండిత్యము, ఏరామాయణము ఈదుష్కీర్తిని బాపఁగలదు! లేదని మాకెఱుకయే! అయినను నొకవిదుషీమణి యహేతుకముగ నపయశమునకుఁ బాల్పడి యధఃపతిత యగుటను గన్నులారఁ జూచుచు నూరకొనుట

కంటె యామెను కులటామండలమున కీడ్వఁబడినకారణములను బరికించి సహేతుకములు కానిచో వెల్లడించుట తోడినారీమణులధర్మ మగుట యాధర్మనిర్వహణనిమిత్త మీవ్యాసము వ్రాయఁబడినది. విజ్ఞులగు చదువరు లిందలిలోపముల సైరింతురుగాక యని నాతొలిమనవి. మొల్ల కులటయనుటకు నాల్గుకారణములు సాధారణముగాఁ జూపఁబడుచున్నవి. (౧) మొల్ల తన రామాయణమునం దసభ్యములగు స్త్రీవర్ణనముల జంకుకొంకులులేక పురుషకవులవలెనే కావించియుండుట; (౨)తన రామాయణమునందు తనయత్తింటివారి ప్రశంసగాని భర్తప్రశంసగాని చేయకుండుట, (౩) మన ఆంధ్రదేశమున పూర్వము పుష్పనామములను కులటాంగనలుమాత్రమే పెట్టుకొనుచుండుట; మఱియు (౪) ఆమె కృష్ణదేవరాయల యుంపుడుకత్తెయని లోకప్రవాద ముండుట. ఆలోచించి చూడ పైనాల్గుకారణములును మొల్లను కులటనుగా జేయునంతటి బలవత్తరములు గావని నాతలఁపు. చూడుఁడు! మొల్ల తనరామాయణమునందలి సుకవిస్తుతియందు శ్రీనాథునితరువాతికవులను బేర్కొనలేదు. కాన యామె పదునాలవశతాబ్దమునం దుండి యుండవచ్చునని యనేకుల యభిప్రాయము. అట్లయిననో కృష్ణదేవరాయలు రాజ్యముచేసినకాలమును మొల్లకాలమును నొక్కటియే యగుచున్నది. రాయలకాలము వంటివలె మఱియేకాలమునందును మన యాంధ్రభాష యట్టిరాజసత్కారములు మంత్రులమన్ననలు,పండితపూజలు,కవిగౌరవములు, నందియుండలేదు. మఱియు నది శృంగారమునకుఁగూడ మంచిప్రాభవకాలము. పదునేనవ శతాబ్దమున శ్రీనాథాది కవీంద్రులచే నాటఁబడిన శృంగార రసాంకురము పదునాఱవశతాబ్దమున పెరిగి పెద్దదై యేచి పేచి కృష్ణదేవరాయల యాస్థానకవులపోషణలో ఫలవృక్షమైనది. ఇఁక నక్కాలపుకవులస్థితి యెట్లున్నది? ప్రతికవికి శృంగారరసముపై మోహమే. అందుచే నాకాలపుకవులు తమకవితాలత నాశృంగార వృక్షమునకుఁ బ్రాకించినఁగాని మనోజ్ఞముగ నుండదని, రాజాదరముఁ బడయదని,ప్రజాగౌరవ మందదని భ్రమించి శృంగారరసమున కాలవాలమగు ప్రబంధములను రచించి పేర్గాంచిరి. కవులహృదయము లిట్లు శృంగారరస మోహముచే నిండి నిబిడీకృతమై,స్త్రీలసిగ్గును బుగ్గిచేసెడి యసభ్యవర్ణనములు గలగ్రంథములను వెలువరించెడి యక్కాలముననే మొల్లగూడ యున్నదనువిషయ మొకింత జ్ఞప్తికిఁ దెచ్చుకొనుఁడు; మొల్ల తనస్త్రీత్వము నెంతచక్కఁగా నిలుపుకొనెనో విశదమగును. శృంగారమునకుఁ దావులేని,భక్తికి దావలమైన సీతారాములకథ నామె వ్రాసినదికాని,శృంగారరసాత్మకమగు కావ్యము వ్రాసెనా? "స్తనభరంబున నీపోఁకి దనరిసట్టి" ఇట్టి పద్యపాదములునారీరచితగ్రంథమునందుండుట యసభ్యమేయనియు, కులకాంత లిట్టి పదములుగల పద్యములు వ్రాయఁజాలరుగాన నామె కులటయనియు కొంద ఱందురు. ఇట్టి యసభ్యపదములు ఆధునిక కవయిత్రీమణుల పాటలలోను,పద్యములలోను గూడఁగలవు. ఆధునిక కవయిత్రీమణిచే వ్రాయఁబడిన లక్షణాపరిణయమను పద్యకావ్యమునందు నిట్టిపదములుగలపద్యము గలదు. పుస్తకము ముద్రణమగువఱకు నాపదమును జూడనైతినని యాకవయిత్రీమణియే మాతో స్వయముగఁ జెప్పెను. అంతమాత్రముచేతనే యాసాధ్వీమణి నెవరు కాదందురు? దుష్కరయతిప్రాసనియమముచేతనో,కావ్యాచారప్రకారమో లేక,ప్రమాదవశముననో, ఇదియొక దోషముగాపాటింపని తత్త్వజ్ఞురాలగుటనో, లేక యప్పటి కాలపరిస్థితులనుబట్టియో, లజ్జాకరములేయగుఁగాక నాలుగైదుపదములట్టివి పడినంతమాత్రమున నామె కులటయనుట యక్రమమును, అతి సాహసమునుగదా!

తండ్రిప్రశంసతోపాటు అత్తవారి ప్రశంసచేయకుండుట మొల్లపై మోపఁబడిన రెండవనేరము. స్త్రీలకు బిడియము నైజగుణము. కాన పతిప్రశంసచేయుటకు నెంతవయసు చెల్లినపడఁతులుగూడ లజ్జింతురు. అందును తల్లిదండ్రులు గురువులు మున్నగు పెద్దలసమక్షమున బాహాటముగ గ్రంథములయందు భర్తనుగూర్చి వివరించుటకు లజ్జించుట స్త్రీస్వభావమునకు విరుద్ధమైన విషయము గాదు. అదియట్లుండె మొల్ల బాలవితంతువని ప్రసిద్ధమైన వాదము గలదు. తన గ్రంథమునఁ జూపిన యసమానవైదుష్యమువల్ల నేమి, తనభర్తనుగూర్చిగాని యత్తవారినిగూర్చిగాని రామాయణమునందు ప్రశంసింపకుండుటచేనేమి మొల్ల బాలవితంతువై యుండుటయే నిజమైయుండునని తోఁచుచున్నది. మొల్ల తనయాత్మీయులలో తండ్రినిదప్ప వేరెవరిని ప్రశంసింపలేదు. తన

విద్యాప్రదాతయెవరో యాతనినైనఁ దెలుపలేదు. 'గురు డాతుకూరి కేసయవర పుత్త్రి' యని చెప్పినది. గురుఁడన తండ్రియు విద్యాప్రదాతయుఁగూడఁ గావచ్చును. వేలుగురుని దెల్పమిచే బహుశఃతండ్రియే యామెకుఁజదువుచెప్పిన గురుఁడైయుండును. కావుననే యతనిని ఘనముగాఁ గీర్తించినది.

గణితశాస్త్రజ్ఞురాలగు లీలావతి తండ్రి బాలవితంతువగు తనపుత్త్రికి గణితశాస్త్రమును నేర్పి విద్యాంసురాలినిగాఁ జేసెను. అట్లే కేసయగూడ బాలవితంతువగు తనకొమార్తెకువిద్య నేర్పియుండును. బాలవితంతువు కావుననే మొల్ల తనయత్తింటిపేరునుగాని భర్తపేరునుగాని చెప్పియుండలేదు. ఆమెయే యననేల? ఆధునికకవయిత్రీమణులగ్రంథములను జూడుఁడు. ఒక్కరైననుదమ భర్తపేరును వ్రాయుచుండిరేమో? ఆధునికవిమర్శకులలో నొక్కరగు శ్రీమతి కంచనపల్లి కనకమ్మగారు తమయత్తింటిపేరగు ద్రోణంరాజువారి నామమును వ్యవహారమునందువాడుటయే యుజ్జగించిరి. లక్షణాపరిణయ గ్రంథకర్త్రియగు సౌభాగ్యవతి గుడిపాటి యిందుమతీదేవిగారు తమ కావ్యమునందు పతిపేరెత్తుకొనలేదు, ఈవిషయముగ మనకన్నుల ముందఱ ననేకులు, పతిప్రశంసచేయని, యత్తింటి ప్రశంసచేయని విద్యావతులు మాంగల్యవతులలోను, వితంతువులలోను గూడ గాన్పించుచుండ నన్నూ ఱేండ్లక్రిందటి మొల్ల తనగ్రంథమున భర్తపేరు చెప్పలేదని, యతని యింటిపేరు తెలుపలేదని యామె కులటయని నిర్ధారించుట ఎంత యహేతుకమో చూడుఁడు.

ఇఁక మొల్లమూఁడవనేరము: పుష్పనామములను మనదేశమునఁ బూర్వముకులటాంగనలుమాత్రమే పెట్టుకొనుచుండుట. కులటయన వ్యభిచారిణి యనియర్థము. కాన వారాంగన కావచ్చును. లేక, నీతిచెడినమఱేజాతి స్త్రీయైన కావచ్చును. వేశ్యలు తమతండ్రియింటిపేరును తమయింటిపేరుగాఁ జెప్పుకొనుటగాని తమతండ్రిపేరును బ్రతిష్ఠగాఁ జెప్పుకొనుటగాని లోకవిరుద్ధమైన విషయము. వెలయాండ్రకుతమతల్లికిఁగాని,తమకుఁగాని శాస్త్రోక్తముగా వివాహమాడిన యొకభర్త లేమిచే వారికి తమ తల్లియింటిపేరే వరుసగావచ్చుచుండును. వివాహితలైన స్త్రీలకు వారిలోగూడ భర్తృగృహనామమే వారికిఁగూడ జెందును. మొల్ల తన రామాయణపీఠికయందు

"క. వారాంగన శ్రీరాముని
పేరిడి రాచిలుకఁ బిలిచి పెంపు వహించెన్
నేరుపుగల చందమ్మున
నారాముని వినుతిసేయ హర్షము రాదే."

వారవనితయే చిలుకను 'రామా'యని పిలిచి మోక్షము నందినది. ఇఁకఁ దాను సద్గతినందుట కేమి సందియమని గదా పైపద్యభావము! ఇట్లు వారవనిత యల్పత్వమును జెప్పుకొనుటచే మొల్ల వేశ్య కాదనుట స్పష్టము. మనుజులకు నామకరణము పుట్టిన కొలఁదిదినములలో దల్లిదండ్రులో, యితర పెద్దలో చేయుదురు. కాని యెవరికి వారు పెట్టుకొనరు. కులటాత్వము వయసు వచ్చినవారైనవెనుక యేర్పడు దుర్గుణముకాని శైశవముననే యేర్పడునదికాదు. ఇక కులటాంగనలు మాత్రమే పెట్టుకొనెడి పుష్పనామము మొల్లకెట్లువచ్చినది? తల్లిదండ్రులు నీతిచెడినవారై యుండవలెను. లేక మొల్ల పెద్దదైనవెనుక తననామమును మార్చుకొని యుండవలెను. భర్తను వలెనే తల్లినిగూడ నామె తన గ్రంథమున బ్రశంసింపక విడిచినది. తండ్రినిగూర్చి

"క. గురులింగ జంగమార్చన
పరుఁడును శివభక్తిరతుఁడు బాంధవహితుఁడున్
గురుఁ డాతుకూరి కేసయ
వరపుత్త్రిని మొల్లయనఁగ వఱలినదానన్."

అని యెంతో ఘనముగఁ జెప్పుకొనినది. ఇట్టి దైవభక్తుఁడగు నామె జనకుఁడు నీతిమాలినవాఁ డనుట దోషము గదా! ఇఁక నామెయే పేరు మార్చుకొనిన దనుకొండమనిన నెక్కుడైన బుద్ధులకు మాఱుకమున్నది కాని పేరులకు మార్పుండునా? కాన పేరుచేత నామెకు కులటాదోషమాపాదించుట న్యాయముకాదు.

ఇఁక నాల్గవది మొల్ల కృష్ణదేవరాయల యుంపుడుగత్తెలలో నొకతెయనుట. ఎక్కడ నెల్లూరు మండల గోపవరము! ఎక్కడ కృష్ణదేవరాయల విద్యానగరము! పోనిండు రాయలు దిగ్విజయార్థియై యాంధ్రదేశమెల్ల పర్యటనము చేసెను గాన మొల్లనుబట్టి

తెప్పించి తన యంతఃపురమునకుఁ జేర్పించెనే యను కొందము. రాయల యంతపుడుగత్తియే యైనచో మొల్ల, కవియు, కవిపోషకుఁడును, కవితా ప్రియుఁడును, విశేషించి మహారాజునైన రాయలనుగూర్చి తన రామాయణమున నొక్కింతయైన ప్రస్తావింపకుండునా, అంతియే కాక మొల్ల

"ఉ. సల్లలితప్రతాపగుణ
సాగరుఁడై విలసిల్లి ధాత్రిపై
బల్లిదుఁడైన రామ నర
పాలకునిన్ స్తుతిసేయు జిహ్వకున్
జిల్లర రాజలోకమును
జేకొని మెచ్చఁగ నిచ్చపుట్టునే
అల్లము బెల్లముం దినుచు నప్పటికప్పటి
కాససేయునే."

అని రాజలోకమునెల్లఁ దృణీకరించినది. మొల్ల కృష్ణదేవరాయల యధీనమునను స్త్రీయైనచో నితరులెల్లవచ్చి గ్రంథములను వ్రాసి తనప్రభువునకుఁ గృతి యిచ్చుచుండఁ దాను తనరామాయణ మాతనికంకితము సేయకుండుటయేకాక "చిల్లరరాజలోకమును జేకొని మెచ్చఁగ నెవ్వరికిచ్చపుట్టు"నని తిరస్కారబుద్ధితో వ్రాసి యుండునా? అట్లు నిరసించిన యంతపుడుగత్తెను రాయలు హర్షించి యుండునా? మఱియు పెద్దన రామరాజ భూషణుఁడాదియగు మహాకవులఁ దన సుకవిస్తుతియందుఁ జేర్చకొనక యేల విడుచును? కాన మొల్లకును రాయలకును నెట్టి సంబంధమును లేదు. బహుశః యేరాజైన రామాయణమును గృతినందఁగోరి మొల్లచేఁ దిరస్కృతుఁ డయ్యెనేమోయనిమాడఁ దైపద్య మూహించుటకు తావొసఁగుచున్నది; కాని యింతమాత్రముననే నిర్ధారింప వలనుగాదు.

మొల్లపైఁ గులటాత్వమును మోపుచున్న కారణములు సహేతుకములు గావని పైవిషయములు తేటపఱచినవి. ఇఁక మొల్ల పేరునుగూర్చి నాకుఁగల సందియములను విన్నవించుకొందును.

మొల్ల తన రామాయణమునందుఁ దనతండ్రి శివభక్తరతుఁడనిస్పష్టముగాఁ దెలిపినది. మఱియు తాను "విఖ్యాత గోపవరపు శ్రీకంఠ మల్లేశువరముచేత, నెఱిఁ గవిత్వంబుఁ జెప్పఁగానేర్చికొంటి"ననియుఁ దెలిపినది. కాన పైరెండు కారణములచేతను నామె నామము మొల్ల గాక మల్లియై యుండుననియు, శివభక్తుడగు నామె జనకుఁడు తన యిష్టదైవమగు మల్లేశ్వరునిపేర తన కొమార్తెకు మల్లియని పేరిడియుండె ననియుఁ మల్లి నామము మొల్లగా జనవాడుకమీఁద మాఱియుండుననియుఁదోఁచుచున్నది. మల్లమ్మ, మల్లయ్య,మల్లి యను పేరు శూద్రులలో(తెలుఁగుదేశపు అన్నితెగలలో) సాధారణముగాఁ బెట్టుకొనెడిపేరే కావున నాదికవయిత్రి నామము మొల్లయనుటకంటె మల్లియనుటయే సమంజసముగను సహేతుకముగను నున్నది. మఱి యొక యుదాహరణము: నేనీమధ్య 'కృష్ణకుమారి' యను విదుషీమణిచే వ్రాయఁబడిన 'భారత విదుషీమణులు,'అను చిన్న హిందీపుస్తకమును జదివితిని. దానియం దనేకవిదుషీమణుల చరిత్రములు గలవు. వారిలో ముక్కాలు మువ్వీసమువంది యుత్తర భారతమువారే. ఇట్లు గ్రంథము చాలవఱకుఁ జదివినను నస్మద్దక్షిణభారతదేశమునందలి విదుషీమణి చారిత్రమొక్కటియుఁ గానరామి నామనంబు చిన్నవోయెను. ఏమి? దక్షిణభారతదేశమున విదుషీమణులే లేరా? ఉండినను నౌత్తరాహులు మనలను జిన్నచూపుచూచి మన దేశపు విదుషీమణుల సచ్చరిత్రములను దమగ్రంథముల వ్రాయమానిరా! అను కుశంకలు నామానసమున నుదయించి యాగ్రహమును నుదయింపఁజేసెను. కాని ఏదేశమువారైనను విదుషీమణులు పూజనీయులే యను భావమునఁజాలవఱకు జదువఁ జివఱకు మధురవాణి, మోహనాంగి, మల్లీ, అభయా, నాచీ, యను నేవురు దక్షిణ భారతదేశపు విదుషీమణుల చరిత్రములు నేత్రపర్వముగ హృదయాహ్లాదకరముగఁ గాన్పించెను. అందు మల్లీయను నామెచరిత్ర మీవిధముగా వ్రాయఁబడియుండెను. "ఈమె దక్షిణ భారతదేశమున జన్మించియుండెను. రాజాకృష్ణదేవుని కాలమున నీ యశస్విని సాహిత్యక్షేత్రమునను నుండి యుండెను. ఈమె యొక కుంభకార పుత్రి. విద్యాభ్యాసమునం దీమెకు మిక్కిలి యనురాగము. ఈమె కవిత చెప్పగలిగియుండెను. ఈమె కవిత్వమునం దీమెయొక్క పూర్ణవికాసము గాన్పింపుచుండెను. ఈమె స్నానముచేసి చెంద్రుకల నారఁబెట్టుకొను సమయమున

కవిత నల్లుచుండెననియు, ఈవిధముగా నీమె యొక రామాయణమును రచియించి యుండెననియు తెలియుచున్నది. ఈమె రామాయణమును విద్యాలయముల యందు పాఠ్యపుస్తకముగా పండితులు నిర్ణయించి యున్నారు." ఈపై చరిత్రాంశములనుబట్టి ఈమల్లి మనము మొల్లగావాడుచున్న యామెయేయని తేటపడుచున్నది. ఈచరిత్రమును జదివిన తరువాత నాకపరిమితానందము గలిగెను. ఆ యానందము రెండువిధములుగా నుండెను. దక్షిణ భారతదేశమున విదుషీమణులే లేరని వాపోవు సమయమున మొల్ల మనపరువు నిలిపినదిగదా యను సంతోష మొకటియు, చిరకాలమునుండి మొల్ల పేరు మల్లిగాని మొల్లగాదను నాయూహ యుత్తరదేశమందైనఁ బ్రచారమున గలదుగదా యను నానంద మొక్కటియు నా సంతసము నినుమడింపఁజేసెను.

మన ఆదికవయిత్రియగు మల్లిచరిత్రమును సూక్ష్మముగాఁ దేలిన యంశముల సంగ్రహముగా నీవిధమున నిర్ణయింపవచ్చును. ఈమె కుమ్మరకులమున జన్మించినది. ఆమె తండ్రి శివభక్తిపరుఁడు గావున తన కొమార్తెకు మల్లియని పేరువెట్టి యుండును. మల్లి వితంతువు. కాని లీలావతికి తండ్రి గణితశాస్త్రమును నేర్పి విద్వాంసురాలినిగాఁ జేసినట్లు మొల్లతండ్రిగూడ తన కొమార్తెకు విద్య నేర్పినాఁడు. మొల్ల వితంతువగుటయేకాక బాలవితంతువుగూడనై యున్నది. కాన సత్తింటి ప్రశంసగాని భర్తప్రశంసగాని చేయలేదు. తన విద్యాభివృద్ధికి జనకుఁడే కారణమగుట నామె యాతనిమాత్రమే తన గ్రంథమునఁ జేర్కొనినది. మల్లి యాత్మగౌరవము గల విదుషి. ఐహిక సంపదలఁ జేరికోరని విరాగి. కాన రాజమాత్రులఁ దృణీకరించినది. మల్లి భక్తురాలు. కాన రామకథనే వ్రాసి రామునకే కృతియిచ్చి కృతకృత్యురాలయినది. మఱియు, మల్లి వినయ సంపదగల సతీమణి కాన తనచరిత్రమును డంబముగా వ్రాసికొనుటగాని, కుకవి నిందసేయుటగాని సేయలేదు. మల్లి తత్త్వజ్ఞురాలు. కాన పదములయౌచిత్యానౌచిత్యములలెక్క సేయలేదు. మల్లి

"నిడుదపెన్నెఱివేణిజడలుగా నవరించి
మలినజీర్ణాంబరం బొలియఁగట్టి
భూమీరజంబు విభూతి పూఁతగఁబూసి
తన దివ్యమూర్తిఁ జిత్తమున నిల్పి
నిరశనస్థితిత్రోడ నిలిచి భూశయ్యను
బవళించి నిదుర యేర్పడఁగ విడిచి
తారకబ్రహ్మ మంత్రంబుఁ బఠింపుచు"

దపముసేయుచుండెడి మహాతపస్వినిగాని సామాన్య స్త్రీ గాదు. తన గ్రంథమును రామాంకితము సేయుటలోఁగాని రాజమాత్రులఁ దృణీకరించుటలోఁగాని మల్లి భాగవత గ్రంథకర్తయు, మహాభక్తుఁడును నగు పోతన యడుగు జాడలలో నడిచినది. అంతియేకాదు. పద్య రచనలోఁగూడ నామె పోతననే యనుకరించినది. చూడుఁడు. మచ్చునకు రెండుపద్యములు

"క. పావని కనుఁగొనె నప్పుడు
పావన విఖ్యాతసుగుణ భావోపేతన్
సేవిత దనుజవ్రాతన్
భూవనితాజాత నిత్యపూతన్ సీతన్.

మొల్ల రామాయణము.

క. భూతలనాథుఁడు రాముఁడు
ప్రీతుండై పెండ్లియాడె పృథుగుణమణిసం
ఘాతన్ భాగ్యోపేతన్
సీతన్ ముఖకాంతి విజిత సితఖద్యోతన్.

భాగవతము.

పై విషయములనెల్ల నిష్పక్షికబుద్ధితోఁ బరికించువారికి ఆదికవయిత్రి నామము మల్లిగాని మొల్లగాదనియు, నామె యుత్తమ స్త్రీగాని కులటగాదనియు దోఁపకపోదు. పండితులును, కవులును, చారిత్రక పరిశోధకులును, మొల్లయొక్కచరిత్రమును సాధించి మొల్ల మల్లియనుట సహేతుక మగునో, కాదో శోధించి, నెల్లూరు మండల గోపవరమున మల్లికేశ్వరాలయముగలదా, లేక మఱియే గోపవరముననైన నున్నదేమో విచారించి నిర్ధరింతురుగాక యని వేఁడుచున్నాను. మొల్లనామము మొల్లయేయైన నారీతిని రూపించియు, కాక మల్లియైనచో నారీతి సంస్కరించియు మొల్ల యపయశమును బాప బ్రయత్నించెదరు గాక యని ప్రార్థించుచున్నాను. దైవానుగ్రహమువలన మొల్ల మల్లిగా యెల్లర యంగీకారమును బడసెనేని మొల్ల కాపాదింపఁబడిన కులటాదోషము కొంతవఱకు బాయునని నామనవి.